# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన సమావేశంలో 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- "నా దేశం- నా బాధ్యత" పేరిట ప్రతీ ఒక్కరూ పొదుపు చర్యలను పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
- శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో డిఫెన్స్ ప్రాజెక్టుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ముఖ్యమంత్రితో కలిసి రేపు శంకుస్థాపన చేయనున్నారు.
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం లభించింది. ఈ సమావేశం అనంతరం కెబినెట్ వివరాలను సమాచార ప్రజా సంబందాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడిస్తూ... తిరుపతిలో 2 వేల 500 కోట్ల రూపాయలతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిళ్ల తయారీ యూనిట్, విశాఖలో లక్ష కోట్ల రూపాయలతో రిలయన్స్ డేటా సెంటర్ ఏర్పాటు, సత్యసాయి జిల్లాలో 51 వేల కోట్ల రూపాయలతో సోలార్ పవర్ ప్లాంట్, కడపలో 12 వేల కోట్ల రూపాయలతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ వంటి కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రణాళికకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందని చెప్పారు. డేటా సెంటర్లు, ఆటోమొబైల్, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులకు కూడా ఆమోదం లభించిందన్నారు. ఎంఎస్ఎంఈలకు నిధుల సౌలభ్యం కల్పించేందుకు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ ఏర్పాటు ప్రతిపాదనపై కూడా కేబినెట్ చర్చించిందని మంత్రి పార్థసారధి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు పొదుపు చర్యలను పాటిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో పొదుపు చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. 'నా దేశం- నా బాధ్యత' పేరుతో పొదుపుపై ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు కాన్వాయ్‌లు తగ్గించుకుంటే సరిపోదని.. ఇతర మార్గాలూ చూడాలన్నారు. వర్చువల్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ పొదుపు చర్యలపై దృష్టిసారించాలని చెప్పారు. వర్క్ ఫ్రమ్ హోంపై అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించాలన్నారు. సౌరశక్తిని పెద్ద ఎత్తున అందిపుచ్చుకోవాలని అందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొదుపు చర్యలను దశలవారీగా చేపడదామని, ప్రతి నిర్ణయానికీ ప్రజలను సన్నద్ధం చేసిన తర్వాతనే ప్రకటన చేద్దామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

======================

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయం సమీపంలో యుద్ధ విమానాల తయారీకి సంబంధించిన డిఫెన్స్ ప్రాజెక్టును అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (AMCA), ఏరో నాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (DRDA)లు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నాయి. ఈ ప్రాజెక్టుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి రేపు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 15 వేల 803 కోట్ల రూపాయలతో 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఇది భారతదేశపు మొట్టమొదటి 5th జనరేషన్ స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్. ఇందులో స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్ వంటి సదుపాయాలతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7 వేల 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు వెల్లడించారు. ఇదే వేదిక నుంచి డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో మరో 12 ప్రాజెక్టులకు సైతం రేపు వర్చువల్ గా భూమి పూజ చేయనున్నారు.

======================

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడో దశకు సంబంధించి ఎన్నికల సంఘం ఈరోజు కీలక ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 30 నుంచి దశలవారీగా ఎస్ఐఆర్ మూడో దశ ప్రారంభమవుతుందని వెల్లడించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 46 వేల 397 మంది బూత్ స్థాయి అధికారులు (BLO)లు, 68 వేల 868 మంది BLAలు జూన్ 15 నుంచి జులై 14 వరకు ఇంటింటికీ వెళ్లి దాదాపు 4 కోట్ల 16 లక్షల మంది ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. అనంతరం జులై 21న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల చేయనున్నారు.

విరామం

======================

రాష్ట్ర స్థాయిలో ఎంటెక్, ఎంఫార్మశీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పిజి ఇసెట్-2026 పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఫలితాలను విడుదల చేశారు. ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in నుంచి ఫలితాలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని, అదే విధంగా వాట్సాప్ నెంబర్ 95523 00009 నుంచి కూడా ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఈ పరీక్షకు 12 వేల 12 మంది దరఖాస్తు చేయగా.. 9 వేల 990 మంది హాజరయ్యారు. వీరిలో 9 వేల 320 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13 సబ్జెక్టులలో గత నెల 28 నుంచి 30 వరకు ఈ పరీక్షను నిర్వహించారు.

======================

తిరుపతి ఐఐటిలో యువసంగం ఫేజ్-6 ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్.. కార్యక్రమాన్ని రేపటి నుంచి ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సహా-నోడల్ అధికారి ఎస్. సోమేశ్వరరావు తెలిపారు. ఆకాశవాణితో ఈరోజు ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల్లో మేథో సంపత్తిని పెంచే ప్రయత్నాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చేపట్టిందన్నారు. పుణె నుంచి వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు రేపు ఐఐటికి చేరుకుంటారని చెప్పారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటూ వైజ్ఞానిక అంశాలను అవలోకనం చేసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ దేవాలయాలను, విద్యా సంస్థలను, అమరావతి, చంద్రగిరి కోటలను సందర్శిస్తారని తెలియజేశారు. శ్రీహరికోటలో ఈనెల 21వ తేదీన రాకెట్ లాంచింగ్ ప్రయోగాన్ని కూడా వీక్షిస్తారని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

======================

నైరుతి బంగాళాఖాతం - పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమలలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపారు. అదే విధంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందని తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాధ్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

======================

ఆకాశవాణి 90 వసంతాల జాతీయోత్సవాల్లో భాగంగా విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా “అలనాటి మధుర భావ గీతాలు” పేరిట రేపు సంగీత విభావరి జరగనుందని రీజనల్ ఛానెల్ మేనేజర్ ఆర్. ఆర్. హర్షలత ఒక ప్రకటనలో తెలిపారు. రేపు సాయంత్రం 6 గంటలకు నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో డాక్టర్ ద్వారం వి.కె.జి. త్యాగరాజ నిర్వహణలో ఈ సంగీత విభావరి ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని ఆమె తెలియజేశారు.

======================

అనకాపల్లి జిల్లా మునగపాక మండలం, టి.సిరసపల్లి గ్రామంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (BDL) సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ప్రతిష్టాత్మక రక్షణ తయారీ యూనిట్‌కు రేపు శంకుస్థాపన జరగనుందని కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ 489 కోట్ల రూపాయల పెట్టుబడితో మాన్యుఫాక్చరింగ్ అండ్ అసెంబ్లీ పరీక్ష (MAT) సౌకర్యాన్ని ఏర్పాటు చేయనుందని, ఈ యూనిట్ దేశ రక్షణ రంగంలో స్వదేశీ తయారీ సామర్థ్యాలను మరింతగా బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

======================
======================